

# శ్రీ భగవద్గీతా మకరందం!

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు



98

## పదునెనిమిదవ అధ్యాయము - మోక్ష సన్న్యాస విభాగయోగము

**6. ఏతాన్యపి తు కర్మాణి సఙ్గం త్యక్త్వా ఫలాని చ**
**కర్తవ్యానీతి మే పార్థ! నిశ్చితం మతముత్తమమ్.**

**వ్యాఖ్య :** క్రిందటి శ్లోకమునందు యజ్ఞదానతపములను తప్పక చేయవలెనని చెప్పబడినది. అయితే వానిని ఏ ప్రకారముగ నాచరింపవలయునో, ఆ పద్ధతి నిచట తెలియజేయుచున్నారు. ఆయా కర్మలను అసంగముగ, ఫలాపేక్షను వదలి చేయవలయునని చెప్పబడినది. సంగముతో (నేను కర్తయను అభిమానముతో) చేయుటవలన, ఫలములను కోరుటవలన కర్మయొక్క పవిత్రత తగ్గిపోవుచున్నది. కర్మలో దోషములేదుకాని దానిని సంగముతో, కర్తృత్వాభిమానముతో చేయుటచే దోషమేర్పడుచున్నది. కాబట్టి ముముక్షువులు అసంగముగ, ఫలాపేక్షరహితముగ ఆ తపోదానాది పుణ్యకార్యములను నాచరించవలెను. తన యీ యభిప్రాయమును గూర్చి 'ఇది నిశ్చయింపబడినది, శ్రేష్ఠమైనది' (నిశ్చితమ్, ఉత్తమమ్) అని భగవానుడు తెలిపినందువలన అద్దాని మహత్తరశక్తి, ఉపాదేయత్వము వెల్లడియగుచున్నవి. ఇది సాక్షాత్ భగవంతుడే బాగుగ నిశ్చయించి చెప్పిన భావము గనుక అతి నిర్దిష్టమై యుండుటచే విజ్ఞులెల్లరును ఇద్దానిని అనుసరించవలయును.

**7. నియతస్య తు సన్న్యాసః కర్మణో నోపపద్యతే**
**మోహాత్తస్య పరిత్యాగ స్తామసః పరికీర్తితః.**

**వ్యాఖ్య :** శాస్త్రవిహితమగు కర్మను ఎవరును త్యజించరాదు. శాస్త్రములందు విధింపబడు కర్మలన్నియు జీవునియొక్క నైతిక ఆధ్యాత్మిక సమున్నతికి దోహదమును గలుగజేయునవియే యగుటవలన వాని నెవరును త్యజింపరాదు. అట్లు త్యజించుట అవివేకమే యగును. కనుకనే 'మోహాత్' అని యిచట చెప్పబడినది. అనగా మోహముచే, అజ్ఞానముచే ఆవరింపబడునపుడు మాత్రమే అట్టి విధ్యుక్తకర్మమును, ధర్మమును త్యజించు సంకల్పము జీవునకు కలుగుచుండునని భావము. కాబట్టి వివేకము నాశ్రయించి అట్టి శాస్త్రనియత కర్మలను పరిత్యజించక ఆచరించుటయే శ్రేయస్కరము. సోమరితనముచేగాని, అజ్ఞానముచేగాని అట్టిదేయగు మఱే కారణముచేగాని వానిని త్యజించినచో అది తామసత్యాగమే కాగలదు.

ఇది వఱలో యజ్ఞదానాదులను గూర్చి వర్ణించునపుడును, మున్ముందు జ్ఞానము, ధైర్యము మున్నగువానిని చెప్పునపుడును మొదట సాత్త్వికమైనదానిని, తదుపరి రాజసమైనదానిని, ఆ పిమ్మట తామసమైనదానిని చెప్పి, ఈ ఒక్క త్యాగమును గూర్చి చెప్పునపుడు మాత్రము మొదట తామసమును, తదుపరి రాజసమును, ఆ పిమ్మట సాత్త్వికమును చెప్పుట గమనార్హమైనది. మొట్టమొదటనే తామసత్యాగుల చర్యను ఖండించవలెనను ఉద్దేశముతో భగవానుడీ విధముగ చెప్పియుండవచ్చును.

**8. దుఃఖమిత్యేవ యత్కర్మ కాయక్లేశభయాత్త్యజేత్**
**స కృత్వా రాజసం త్యాగం నైవ త్యాగఫలం లభేత్**

**వ్యాఖ్య :** తామసత్యాగి అజ్ఞానమువలన విద్యుక్తకర్మలను వదలుచున్నాడు. రాజసత్యాగియో ఆ కర్మ చేయుట ప్రయాసమని తలంచి దానిని వదలివేయుచున్నాడు. అనగా సోమరితనము వహించుచున్నాడని అర్థము. ఉత్తమ సుఖమును గలుగజేయు క్రియలు సామాన్యముగ ప్రారంభములో కష్టముగా తోచును. కాని తుదకు అనంతసుఖమునే కలుగజేయును. కాని రాజసత్యాగి ప్రారంభమునతోచు కష్టమునకు బెదరిపోయి, సోమరితనముచే ఏమాత్రము శ్రమించక, ఆ కర్మలనే వదలివైచు చున్నాడు. బ్రహ్మ ముహూర్తమున లేచుట, శీతలోదకముచే స్నానము చేయుట, బ్రహ్మచర్యమును పాలించుట మున్నగు క్రియలు ప్రారంభములో కష్టముగా తోచవచ్చును. కాని అవియే తుదకు మహదానందమును కలుగజేయును. కాని రాజసత్యాగి (బద్ధకము వలన) వానిని చేయుటకు నిచ్చగింపక వదలిపెట్టుచున్నాడు. అట్టివానికి త్యాగముయొక్క ఫలమేమియు లభించుటలేదు ఏలననగా త్యాగమనగా సంగత్యాగమేకాని కర్మ త్యాగము కాదు. వారే, కర్మలనే త్యజించివేయుచున్నారు. ఈ ప్రకారముగా తామసుడు, రాజసుడు వేర్వేఱు కారణములచే విద్యుక్తకర్మలను త్యజించివైచుచు తత్ఫలములను పొందకున్నారు.

**9. కార్య మిత్యేవ యత్కర్మ నియతం క్రియతేఽర్జున!**
**సఙ్గం త్యక్త్వా ఫలం చైవ స త్యాగస్సాత్త్వికో మతః.**

**వ్యాఖ్య :** త్యాగమనగా సంగత్యాగమే కాని, ఫలత్యాగమేకాని, కర్మత్యాగము కాదని ఈ శ్లోకము ద్వారా స్పష్టముగ వెల్లడియగుచున్నది. మఱియు 'కార్యమ్' అని చెప్పినందువలన శాస్త్రనియతమగు కర్మ మనుజుడు తప్పక చేయవలెనియే బోధితమగుచున్నది. తామసుడు శాస్త్రవిధి తెలియక దాని నాచరించకనుండును. రాజసుడు తెలిసియు ఆచరించుట కష్టమని భావించి దానిని చేయకుండును. సాత్త్వికుడు తెలిసియు, కష్టములకు జంకక, సంగమును, ఫలమును త్యజించి దాని నాచరించును. సాత్త్వికునిదే ఉత్తమపద్ధతియనియు, అతడు కావించిన త్యాగమే ఉత్తమత్యాగమనియు ఈ శ్లోకము ద్వారా విదితమగుచున్నది. కావున అద్దానినే విజ్ఞులవలంబించవలెను.

**10. న ద్వేష్ట్యకుశలం కర్మ కుశలేనానుషజ్జతే**
**త్యాగీ సత్త్వసమావిష్టో మేధావీ ఛిన్నసంశయః**

**వ్యాఖ్య :** సత్త్వగుణముతో గూడిన కర్మఫలత్యాగి ద్వంద్వములందు సమబుద్ధి గలిగి యుండునని చెప్పబడుచున్నది. ఒక దానిని ద్వేషించుటగాని, మఱియొక దానియందు ఆసక్తిగలిగి తగుల్కొనుటగాని యతనికుండదు. అతడు ఇచ్ఛాద్వేష రహితుడై యుండును. అశుభకర్మను, కామ్యకర్మను ద్వేషింపడని చెప్పినంత మాత్రముచేత దానిని ప్రేమించుననని అర్థము కాదు. జీవన్ముక్తునిపగిది దానియెడల తటస్థభావముగలిగి, తాను మాత్రము దాని నాచరింపక శుభకార్యమునే, నిష్కామ కర్మమునే ఆచరించును. అట్లాచరించినను దానితో కలియక, దానియం దభిమానము (సంగము) లేకయుండును.

**11. న హి దేహభృతా శక్యం త్యక్తుం కర్మాణ్యశేషతః**
**యస్తు కర్మఫల త్యాగీ స త్యాగీత్యభిధీయతే.**

**వ్యాఖ్య :** దేహధారియగు జీవుడు దేహసంరక్షణాదులకై కర్మను చేయవలసియే యున్నాడు. కావున కర్మలను సంపూర్తిగా విడుచుట కాతనికి సాధ్యపడదు. ఇక్కారణమున ఆ యా కర్మలను చేయుచు వాని ఫలములను విడచుటయే సర్వోత్తమమగు పద్ధతి. అట్టివాడికి ఆ కర్మలచే బద్ధుడు కానేరడు. మఱియు అట్టివాడే త్యాగియని చెప్పబడును. త్యాగి యనగా బాహ్య వస్తువులను త్యాగముచేయువాడు కాదనియు, కర్మలను చేయుచు వాని ఫలములను వదలువాడే త్యాగియనియు, అభిమానమును, సంగమును త్యజించువాడే త్యాగియనియు ఈ శ్లోకము ద్వారా వెల్లడియగుచున్నది. కేవలము కర్మలను వదలివేసినంత మాత్రమున మనుజుడు త్యాగికానేరడు, త్యాగఫలమును బొందనేరడు. కర్మలను గావించుచు వాని ఫలములను వదలువాడే త్యాగియగును. మఱియు త్యాగఫలమును బొంద గలుగును. దీనినిబట్టి అంతరంగమునగల త్యాగిత్వము ఫలాపేక్షారూప (దేహాభిమానరూప) అంతరంగమనోవృత్తి యొక్క త్యాగముపైననే ఆధారపడియున్నదిగాని బాహ్య వస్తువులయొక్క పరిత్యాగముపై గాదని స్పష్టపడుచున్నది. కావున కర్మలను జేయవలెననియు, కాని ఫలాభిసంధిరహితముగ చేయవలెననియు భగవంతుని ఆశయమై యున్నట్లు తెలియుచున్నది.

*(తరువాయి వచ్చే సంచికలో)*

# ఉత్తిష్ఠో గోవింద! ఉత్తిష్ఠ గరుడ ధ్వజా! ఉత్తిష్ఠ నరశార్దూలా!

తిరుమల క్షేత్రం ఆనంద నిలయం. బ్రాహ్మీ ముహూర్తంలో తిరునామాలతో అర్చక స్వాములూ, తాళ్లపాక వంశీయులూ శ్రీవారి మహాద్వారం వద్దకు చేరుకుంటారు. నౌబత్‌ఖానాలో నగారా మోగుతుంది. తలుపులు తెరచుకుంటాయి. శ్రీవారి కైంకర్యపరులకు దారీ అంటూ సన్నిధి గొల్ల ఆలయ సిబ్బందిని భక్తుల్నీ జాగృత పరుస్తాడు. తొట్టతొలి పుట్టలో శ్రీనివాసుడిని దర్శించుకున్న యాదవుడి వంశీయుడితడు. అందరూ, విమానగోపుర ఆవరణలోకి ప్రవేశిస్తారు. జియ్యంగార్లూ ఆలయ అధికారుల నేతృత్వంలో సన్నిధిగొల్ల బంగారు వాకిళ్ల తాళాలు తెరుస్తాడు. అర్చకులు తమ దగ్గరున్న 'కుంచెకోల' అనే పరికరాన్ని బంగారు వాకిళ్ల రంధ్రంలోకి లౌక్యంగా దూర్చి, లోపలివైపు గడియను తీస్తారు. ఇది అర్చక కుటుంబానికి మాత్రమే తెలిసిన రహస్య విద్య! బంగారు వాకిళ్లను కొద్దిగా తెరచి సన్నిధిగొల్ల ముందుగా తానొక్కడే లోపలికి వెళ్తాడు. మరుక్షణమే కౌసల్యా సుప్రజారామా పూర్వా సంధ్యా ప్రవర్తతే.. అన్న మేలుకొలుపు.

కౌసల్య అమ్మపేరు వినిపించగానే గాఢనిద్రలో ఉన్న కమలాక్షుడి కనురెప్పలలో కదలిక, కౌసల్యమ్మరూపం స్వామి మనసులో మెదిలే ఉంటుంది. పెదాల మీద చిరునవ్వు. అద్దంలో చందమామను చూపుతూ అమ్మ తినిపించి పాలబువ్వ గుర్తుకొచ్చి ఉంటుంది. విశ్వామిత్రుడి వెనువెంట యాగ సంరక్షణకు బయల్దేరే సమయానికి రాముడు కౌమారుడే అయినా, అచ్చంగా అమ్మచాటు బిడ్డడు. ఎంత గాడనిద్రలో ఉన్నా, తల్లి పేరు వినిపించగానే బిడ్డ దిగ్గున మేల్కొంటాడు. **కౌసల్యా సుప్రజా రామ.** పదప్రయోగ రహస్యమూ అదే. వాల్మీకి రామాయణంలో జనకుడికి బ్రహర్షి పలికిన ఆ మేలుకొలుపే వేంకటేశ్వర సుప్రభాతానికి ప్రారంభ శ్లోకం. త్రేతాయుగంలో రాముడికి పలికిన సుప్రభాతం.. కలియుగంలో వేంకటరాముడి సుప్రభాతమైంది.

ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవమాహ్నికం.. తెలతెలవారుతోంది. కర్తవ్య నిర్వహణకు సమయం ఆసన్నమైందని విశ్వామిత్ర మహర్షి రాముడికి గుర్తు చేస్తున్నాడు. తెల్లవారేలోపు సంధ్యాది విధులు ముగించుకుని విల్లంబులతో యాగ సంరక్షణకు బయల్దేరాలి. లలిత మోహనాంగుడైన రాముడు 'ఫాలనేత్రానాల ప్రబల విద్యుల్లతా కేలీ విహార లక్ష్మీనారసింహా' అన్నట్టుగా నరశార్దూలమై నృసింహావతారం నాటి ఉగ్రత్వాన్ని ప్రదర్శించాల్సిన సమయం ఆసన్నమైంది. సూర్యోదయ మార్పునకది ప్రతీక.

**ఉత్తిష్ఠోత్తిష్ఠ గోవింద ఉత్తిష్ఠ గరుడధ్వజ**
**ఉత్తిష్ఠ కమలాకాన్తా త్రైలోక్యం మంగళం కురు**
**ఉత్తిష్ఠ గోవిందా..**

ఎవరిపేరు వారికి సంగీతంలా వినిపిస్తుందంటారు. ముద్దుపేరంటే మరీ ముద్దు! మూడు నామాలవాడు వేయి నామాలవాడూ కేశవ నామాలూ మొదలు విష్ణు సహస్రనామాల దాకా అన్నీ ఆయనవే! 'గోవిందా' అనగానే పాడి ఆవులు గుర్తుకొస్తాయి. పచ్చని రేపల్లె గుర్తుకొస్తుంది. బంగారు బాల్యం గుర్తుకొస్తుంది. సుయ్యిసుయ్యింటూ కవ్వపు సవ్వడులు గుర్తుకువస్తాయ్. గలగలమంటూ యమునా ప్రవాహాలు, కిలకిలమంటూ గోపకాంతల నవ్వులు, చిటికెనవేలితో గోవర్ధనగిరిని పైకెత్తిన ఘట్టం, దేవేంద్రుని గర్వమణచిన తీరు. కొండనీడలో 'గోవిందా గోవిందా' అంటూ రేపల్లె జనం జయజయధ్వానాలు చేస్తున్న దృశ్యం.

**ఉత్తిష్ఠ గరుడధ్వజా...**


గరుడాళ్వార్ రెక్కల తేరెక్కడమంటే స్వామికి మహా ఇష్టం! ఇటు గరుడని నీవెక్కిననను పటపట దిక్కులు బగ్గున పగిలె మహాప్రభూ! గరుడవాహనం మీద బయల్దేరావంటే ఎక్కడో దుష్టశిక్షణ జరిగిపోయినట్టే! గరుడుడి రెక్కల చప్పుడులో వేదనాదం వినిపిస్తుందట! వేదాలకు మూలమైన దేవరకు వినయపూర్వకంగా సేవచేసిన ఫలం కావచ్చు.

**ఉత్తిష్ఠ కమలాకాన్తా..**

'కమలాపతీ! ముల్లోకాలకూ శుభం కలిగేలా మేలుకో! దేవేరి పేరు వినిపించగానే దేవదేవుని మదిలో తీయని ఊహలు. నిద్దురలోనే నల్లనయ్య బుగ్గలు ఎర్రబారుతాయి. క్షీరసాగరంలోంచి పుట్టిన పాలబుగ్గల పడుచు.. .మెడలో వరమాల వేసిన ప్రియఘట్టమేదో గుర్తుకొచ్చి ఉంటుంది. ఓ వైపు బ్రహ్మాది దేవతలు, మరో వైపు రాక్షసులు, ఎవరివంక చూసినా ఏదో ఓ లోపం, అప్పుడే నెలవంక తిలకం దిద్దుకున్న విష్ణుమూర్తి కనిపించాడు. ఏ వంకా పెట్టలేని దివ్యమోహనమూర్తి

**సాధురక్షకుండు షడ్వర్గరహితుండు**
**నాథుడయ్యెనేని నడపనోపు**
**నితడె భర్తయనుచు నింతి సరోజాక్షు**
**బుష్పదామకమున బూజచేసె..**

ఆ పాదాల్ని పూలతో అభిషేకించి, తనను తాను సమర్పించుకుంది. స్వామి ఏకంగా హృదయంలోనే స్థానమిచ్చి ప్రేమను చాటుకున్నాడు. ఇద్దరిదీ అన్యోన్య దాంపత్యం. హృదయ స్థానంలో ఉంటే ... సురుల సింగార రాయుడిని రెప్పవాల్చక చూడటం సాధ్యంకాదు కాబట్టి.. శ్రీదేవి.. భూదేవి రూపంలో మూల విరాట్టుకు ఇరుపక్కల చేరిందట. అయినా తనివితీరక నీలాదేవిగానూ అవతరించిందట. స్వామికైతే, అమ్మవారిచేపే వేయి అమృత భాండాల శక్తి. వరహా అవతారంలో రాక్షస సంహారం చేశాక శ్రీహరి తీవ్రంగా అలసిపోయాడట. ఎంతకీ బడలిక తీరలేదు. అంతలోనే శ్రీసతి ఎదురొచ్చి ప్రేమారా నవ్విందట! ఆ వలపు నవ్వుల మైమరపుతో అలుపు తీరిపోయిందట. ఉత్తిష్ఠ గోవిందా! ఉత్తిష్ఠ గరుడధ్వజా– అంటూ స్వామిని మేలుకొలుపుదాం. మేను తరింప చేసుకుందాం.



# మాధవసేవలోనే మానవసేవ చేస్తున్న మహితాత్ముడు శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన జీయర్ స్వామి!

## - నేపాల్‌లోని భూకంప బాధితులకు స్వయంగా వెళ్ళి సేవ చేసారు!!-



భూకంపంతో కూలిన భవనాలను పర్యవేక్షిస్తున్న శ్రీశ్రీశ్రీ స్వామివారు వికాసతరంగిణీ బృందం





'ప్రముఖాంధ్ర' పత్రిక శ్రీస్వామివారి మంగళాశాసనంతో 22 సంవత్సరాల 6 నెలలుగా మంగళకరంగా వస్తూన్నది. శ్రీశ్రీశ్రీ శ్రీమన్నారాయణ చిన జీయర్ స్వామివారికి ముకుళిత హస్తములతో కృతజ్ఞతా వందనములు చేస్తున్నాం.

మా మూడవ అబ్బాయి చి॥ నాగసాయీ ప్రసాద్ అమెరికా వెళ్ళే ముందు తిరుచానూరులో శ్రీయాగం చేస్తున్న స్వామివారి ఆశీస్సులను తీసుకున్నాడు. శ్రీనివాసుని వంటి మోము, శ్రీకృష్ణుని వంటి ముద్దుల చిరునవ్వు, మృదుభాషణము, మంగళాశాసనం వారి సహజలక్షణం. జాతీయాంతర్జాతీయంగా అనేకమంది భక్తులకు ఆత్మానందం కూరుస్తున్నారు.

మానవసేవే మాధవ సేవగా భావించి ప్రతి ఒక్కరూ మానవత్వంతో ముందుకు రావాలని పరమహంస పరివ్రాజకాచార్య శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన జీయర్ స్వామీజీ అన్నారు. మాధవసేవను చేయాలంటే దానికి మానవసేవే ఏకైక మార్గమని చెప్పారు. ఈ క్రమంలో కేవలం మానవులకే కాకుండా సమస్త జీవకోటికి మేలు చేకూర్చే విధంగా ప్రతి ఒక్కరూ తమ జీవనశైలిని తీర్చిదిద్దుకోవాలి. మానవులే కాకుండా పశుపక్ష్యాదులు, ఇతర జీవజాలం ఉనికికి భంగం వాటిల్లకుండా తమ జీవనశైలిని రూపొందించుకోవాలి. నైతిక విలువల ఆధారంగానే ఏ సమాజమైనా మనగలుగుతుంది. లేకుంటే ఆ సమాజం ఏదొక దశలో విలువలు క్షీణించి కుప్పకూలిపోతుందని చెప్పారు. పిల్లల స్థాయి నుంచే తల్లిదండ్రులు నైతిక విలువలను వారిలో పెంపొందించేందుకు కృషి చేయాలని చెప్పారు. లేనిపక్షంలో భవిష్యత్తు తరానికి అన్యాయం చేయడమే కాకుండా, ఆ ప్రభావం సమాజంపై బడి తీవ్రంగా ఉంటుందని చెప్పారు. ఇటువంటి పరిణామాల వల్ల మానవ సంబంధాలు దారుణంగా దెబ్బతిని విలువలకు గౌరవం లేని దుస్థితి నెలకొంటుందన్నారు. క్రమంగా అదే సమాజం దెబ్బతినడానికి దారి తీస్తుందని, ఇది ఎంత మాత్రం సహించరానిదని చెప్పారు. అందువల్ల ప్రతీ ఒక్కరూ సమాజ భవిష్యతుక్తు బాధ్యత నెరిగి నైతిక విలువలకు సరైన పునాది పడేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

ఆధ్యాత్మిక ఉపన్యాసాలిచ్చే వారెందరో ఉన్నారు! కొందరు ఆచరణ శూన్యులు. వారు చేయరు, చెబుతారు, చేయమంటారు. సేవ చేయాలనుకున్నవారు, శిష్యులు సరిగా చేస్తున్నారా లేదా – అన్నది పరిశీలిస్తారు. స్వయంభూపీఠాధిపతులు అసలు దిగిరారు. అన్నమో రామచంద్రా! గూడులేదు! కూడులేదు! నీడలేదు! సీతారామా– అనిన వేదనావేదన వాక్కులను పశుపతినాథుడు, ఆలకించి పరంధాముడైన రంగనాథునికి విన్నవించాడేమో! అప్పుడే అమెరికా పర్యటన్నుంచీ వచ్చిన శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామివారు గజేంద్రుని ఆర్తనాదాన్ని ఆలకించిన శ్రీమహావిష్ణువు వలె నేపాల్‌లోని ఖాట్మండు నగరం, వివిధ ప్రాంత భూకంప బాధితులకు ఆహారపదార్థములను, మంచినీటిని, వైద్య వసతులనూ కల్పించారు. స్వయంగా సేవలు చేసారు.



# వాల్మీకిపురంలోని ప్రతాప రామాలయం!
# జాంబవంతుడు విగ్రహప్రతిష్ఠ చేసాడు

వెయ్యేళ్ళ చరిత్ర, ఘనమైన ఆధ్యాత్మిక నేపాధ్యాలతో శతాబ్దాల పర్యంతం ఎందరో దేశవిదేశీ ప్రముఖులను మోకరిల్లజేసుకున్న మహిమాన్విత వాల్మీకి క్షేత్రం. దేశంలో మరెక్కడా లేని ఎన్నో అరుదైన విశేషాల సమాహారంగా ఉన్న పుణ్యక్షేత్రం. ప్రచార ప్రాముఖ్యతలకు నోచుకోలేకపోతోంది.

చిత్తూరుజిల్లా వాల్మీకిపురంలోని శ్రీప్రతాప రామాలయానికి క్రీస్తుశకం 13వ శతాబ్దంలో జీర్ణోద్ధరణ జరిగినట్లు శాసనాధారాలున్నాయి. ఊరికి దక్షిణాన శతశృంగ, పడమర వానర పర్వతాలున్నాయి. స్థానికులు నూరుకుప్పల కొండ, కోతులగుట్టగా పిలుస్తారు. వీటిలో వాల్మీకి తపస్సు చేసి, ఇక్కడి రాముని సేవించారనే గాథలు ప్రచారంలోవున్నాయి. ఆలయంలో వాల్మీకి మహర్షికి అనుబంధ ఆలయం ఉంది. రాముడి మూలవిగ్రహం పుట్ట (వల్మీకం)లో దొరికినందున వల్మీక క్షేత్రంగా పేరొచ్చిందనే గాథా వుంది. స్థానిక చరిత్రను తిరగేస్తే గుడి ముంగిట వావిలిపాటి వారి సత్రం ఉండేది. తిరుమల యాత్రికులు రాముని దర్శించి సత్రంలో సేదదీరేవారు. కాలక్రమంలో జనావాసమైంది. వావిలిపాటి సత్రమే క్రమేపీ వావిలిపాడు, వాయల్పాడుగా మారింది. పట్టణ చరిత్ర దృష్ట్యా ప్రభుత్వం వాయల్పాడు పేరును వాల్మీకిపురంగా మార్చింది.

శ్రీప్రతాప రామాలయాన్ని జాంబవంతుడు ప్రతిష్టించాడని స్థల పురాణం చెబుతోంది. ఇక్కడ రాముడు, సీత, లక్ష్మణ భరత, శతృఘ్ను, హనుమత్సమేతంగా ఒకే శిలపై వెలిశారు. ఇలా మూలవిగ్రహాలుగా భార్య ముగ్గురు తమ్ముళ్ళతో కలిసి శ్రీరాముడు కొలువైన ఆలయం అరుదైనది. ఇక్కడ రాముడు ఖడ్గం ధరించి ఉన్నారు. ఈ తరహా శ్రీరాముడి విగ్రహం ప్రపంచంలోనే అరుదైనదని బ్రిటీషు హయాంలో కడప కలెక్టర్‌గా పనిచేసిన సి.పి. బ్రౌన్ తన డైరీలో పేర్కొన్నారు. సాంప్రదాయనికి భిన్నంగా సీతమ్మ శ్రీరాముడి కుడివైపు వున్నారు. లోకమంతా సీతారామ కల్యాణం శ్రీరామనవమికి జరిగితే ఇక్కడ సీతమ్మ జన్మ నక్షత్రమైన ఆశ్లేష నక్షత్రం రోజున నిర్వహిస్తారు. ఇవన్నీ స్త్రీ ప్రాధాన్యతను చాటే అరుదైన విశేషాలు. మనుస్మృతి చెందిన అరుదైన శాసనాలు ఇక్కడున్నాయి. గుడిలో పలు అనుబంధ ఆలయాలున్నాయి. 1484లో చంద్రగిరి పాలకుడు సాళువ నరసింహరాయలు ఇక్కడి విఠలేశ్వరాలయం కట్టించారు. దీనికి సంబంధించిన శాసనం కూడా వుంది. వాల్మీకి, ఆంజనేయస్వామి, చెన్న కేశవస్వామి, శ్రీదేవిభూదేవి సమేత శ్రీరంగనాథ స్వామిలకు, నమ్మాళ్వారు, రామానుజాచార్యులు, వేదాంత దేశికులు, తిరుమంగై యాళ్వారు, పరాశర భట్టర్ తదితర ఆళ్వార్లకూ అనుబంధ ఆలయాలున్నాయి. తాళ్ళపాక అన్నమాచార్యులు కొంతకాలం ఇక్కడి రామునిని సేవించారు. తాను ప్రత్యక్షంగా తిలకించిన ఆలయ పూజలను, ఉత్సవాలను వర్ణిస్తూ పలు సంకీర్తనలు రాయగా వాటిలో 27 సంకీర్తనలను టీటీడీ ముద్రించింది. ఆలయ చారిత్రక వైభవానికి, ప్రాశస్త్యానికి ఆ సంకీర్తనలే సాక్షీభూతం. 1997లో ఆలయాన్ని టీటీడీ దత్తత తీసుకుంది. ఏటా బ్రహ్మోత్సవాలప్పుడు కళ్యాణోత్సవంలో స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేసేలా 2007లో స్థానిక మేజర్ పంచాయతీ, మండల పరిషత్‌లు తీర్మానాలు ఆమోదించి అమలు చేస్తున్నాయి. కత్తి ధరించిన శ్రీరాముణ్ణి యిక్కడే దర్శించగలం.

**వాల్మీకి క్షేత్రాన్ని శతాబ్దాలుగా ఎందరో పాలకులు, ప్రముఖులు దర్శించారు. చొక్కనాథ భూపతి, సాళువ నరసింహరాయలు, మధుర రాజు విశ్వనాథ నాయకుడు, ఛత్రపతి శివాజీలతో పాటు పలువురు పాలెగాళ్ళ దాన శాసనాలు గురు సమర్ధ రామదాసు, మరాఠా పాలకులు తారాబాయి, పీష్వా బాజీరావు, పీష్వా బాలాజీరావు, మంత్రి మౌలాంకర్ పంత్, సేనానులు తులసీ భోన్సలే, రఘోజీ, మరాఠా కవులు మరోజ్‌పంత్, విశ్వనాథ్ పంత్, కొల్హాపూరు రాజు కోనేరు తిరుమల రాయలు తదితరులతోపాటు ఫ్రెంచి కంపెనీ సేనాని కోల్‌బార్ట్, ఈస్టిండియా కంపెనీ ప్రముఖులు మైఖేల్ జోర్డాన్, లార్డ్ ఆడ్మస్, అమ్మో బూచి అంటూ పసిపిల్లలూ భయపడేలా చరిత్రలో నిలిచిపోయిన ఫ్రెంచి సేనాని బుస్సీ (1759 ఏప్రిల్4న) తదితరులు స్వామివారిని దర్శించి విలువైన కానుకలు సమర్పించారు. రాయలసీమ ప్రిన్సిపల్ కలెక్టర్‌గా పనిచేసిన సర్‌థామస్ మన్రో, కడప కలెక్టరుగా పనిచేసిన సీపీ బ్రౌన్, సర్‌హాడ్ హార్డింగ్స్ కూడా ఇక్కడి రాముని సేవించారు. హార్డింగ్స్ 1818లో గుడి ఎదుట తన పేరిట మండపం నిర్మించారు.**

*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*

**HOTEL MAYURA**

204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)
(Opposite Bus Station)
Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911
e-mail : mayurahotels@yahoo.co.in, Grams :



శ్రీశ్రీ గణపతి సచ్చిదానందస్వామి

శ్రీశ్రీ విజయానంద స్వామి

# మైసూర్ దత్తపీఠ ఉత్తరాధిపతి
# శ్రీశ్రీ దత్త విజయానందస్వామివారి 39వ జన్మదిన సంరంభం

## -స్వాములవారిని ఒక పర్యాయం కర్నూలులో శ్రీ టి.జి. వెంకటేష్‌తో దర్శించాను-


మైసూర్‌లో శ్రీశ్రీశ్రీ దత్తగణపతి సచ్చిదానందస్వామివారు శ్రీదత్త ఆశ్రమం స్థాపించిన తరువాత అవధూత దత్తాత్రేయ స్వామివారు గురించి బహుళ ప్రచారం జరిగింది. అనేక పట్టణాలయాల్లో దత్తమందిరాలను స్థాపించారు. అంత ప్రసిద్ధిగొన్న దత్తపీఠానికి ఉత్తరాధికారిగా శ్రీశ్రీ దత్త విజయానంద తీర్థస్వాములవారని ఎన్నుకొన్నారు. ఆశ్రమ ఉత్తరాధికారి నియమించడానికి పూర్వం సకల శాస్త్రములూ స్వామివారు అధ్యయనం చేసారు. పురాణేతిహాసాలను అతి సున్నితంగా, జనరంజకంగా ఉపన్యసించడంలో విజయానందులు దిట్ట. 'భక్తిమాల'లో వ్రాస్తున్న రామాయణ ఇతిహాసమే ఇందుకు నిదర్శనం.

విద్య, విద్యకు మించిన ఉపన్యాసధారణ, వీటన్నిటికీ మించిన వివేచనం, సకలములూ మూర్తీభవించిన శ్రీశ్రీ దత్త విజయానంద తీర్థస్వాములవారు 39వ జన్మదిన ప్రవేశ సందర్భమున 'ప్రముఖాంధ్ర' వినయపూర్వక అంజలులు సమర్పిస్తూంది. ఇలాగే వారు 120 సంవత్సరములు సంపూర్ణ ఆరోగ్య జన్మదినములు జరుపుకోవాలని అవధూత శ్రీశ్రీ దత్తాత్రేయ స్వామివారిని ప్రార్థిస్తున్నాం.

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన
"అజంతా"
వక్కపొడి
రవికుమార్ అండ్ కంపెని - చెన్నై
044 25204046, 26171341

Beautiful City - Beautiful Hotel


Foreverar your Serivice in the Heart of Visakhaparnam
HOTEL Daspalla
Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225




# సింగంశెట్టి యతీంద్రులు శెట్టి ఛారిటీస్ ద్విశత వార్షికోత్సవం!

ధర్మపరులైన వైశ్యులు స్థిరచిరంగా ఉండే కార్యక్రమాలు చేస్తారు. మనిషి యెంతగా బ్రతికినా నూరేండ్లు బ్రతుకగలడు. కానీ ఆయన ధర్మాలు, ధర్మకార్యాలు, ధర్మసత్రాలు, ధర్మనిధులు వంద సంవత్సరాలు జీవిస్తాయి. అట్టి ధర్మపరునికి ఉత్తమగతులు సిద్ధిస్తూనే ఉంటుంది. సింగంశెట్టి యతీంద్రుల శెట్టి 1816లో జన్మించారు. ఆయన నెలకొల్పిన ఛారిటీస్ సంస్థ 2016 మార్చిలో ఆళ్వార్‌పేటలోని యతిరాజ కల్యాణమండంలో ద్విశత వార్షికోత్సవం జరుపుకుంది. ఆ చారిటీస్ పాలకమండలి ఆయన జ్ఞాపకార్థంగా జరిపిన ద్విశత వార్షికోత్సవ కార్యకర్తలను అభినందిస్తున్నాం.

సింగంశెట్టి యతీంద్రుల శెట్టి కర్ణాటకలోని శ్రీరంగపట్నంలో వకుళాభరణం శెట్టి, అనంతమ్మ దంపతులకు 1816లో జన్మించారు. తండ్రి చెన్నైకి మకాం మార్చారు. క్యాషియర్‌గా సేవలందించారు. తండ్రి మరణానంతరం యతీంద్రులు శెట్టి కూడా క్యాషియర్‌గా విధులు నిర్వహిస్తూ, మరో వైపు జీడి పప్పు, ఉప్పు వ్యాపారం మొదలుపెట్టారు. ఈయనకు యతిరాజమ్మతో వివాహమైంది. ఇద్దరు కుమారులు కలిగారు. పట్టిందల్లా బంగారమైంది. క్యాషియర్ ఉద్యోగం వదలిపెట్టి పూర్తిగా వ్యాపారంలో నిమగ్నమయ్యారు. బంగారు నూలు వ్యాపారంతో సంపన్నులయ్యారు. భార్యాపిల్లలు మరణించడంతో వైరాగ్యం కలిగింది. తన యావదాస్థిని ధర్మ సంస్థ పేరిట 1899 జూలై 17న వీలునామా రాశారు. మరో తొమ్మిది మందితోపాలక మండలిని ఏర్పాటు చేశారు. నెలరోజులు తిరగకుండానే 1899 ఆగస్టు 9న 83 ఏళ్ల వయసులో కాలం చేశారు. వీలునామా ప్రకారం 117 సంవత్సరాలుగా పాలకమండి సభ్యులు ఆయన ఆశయాలను అంకితభావంతో ఆచరణలోపెడుతున్నారు. దేవాలయాల నిర్మాణానికి, పునరుద్ధరణకు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. పేద విద్యార్థుల చదువులకు ఉపకార వేతనాలు అందిస్తున్నారు. ఏ ఆధారం లేని వితంతువులకు, అభాగ్యులకు దాదాపు 500 మందికి నెల నెల పింఛను పంపుతున్నారు. శ్రీపెరుంబుదూరులో వృద్ధాశ్రమాన్ని నడుపుతున్నారు. ప్రస్తుతం ఉమ్మడి ఎతిరాజ్, వీరబొమ్మల జనార్ధనరావు, పాతాళం మధుసూదన్, ముక్కాల శ్రీరాం ప్రసాద్, ఊటుకూరి బద్రీనారయణ (కార్యదర్శి), పసుమర్తి బద్రీనాథ్ (కోశాధికారి), తవ్వా అంజన్‌కుమార్, రంగనాథన్, రూప్‌కుమార్, ఏల్చూరు సురేశ్‌బాబు, సూరా లక్ష్మయ్య శివషణ్ముఖం (అధ్యక్షుడు) పాలకమండలి సభ్యులుగా పూర్ణాంకిత సేవలందిస్తున్నారు.

# ప్రజాపాలనంలో భారతదేశం విశిష్టంగా నిలిచింది!

ప్రపంచంలోని యెన్నో దేశాలు ప్రజాస్వామ్య పాలన చేరువకి వచ్చాయ్. ఈ విషయంగా చెప్పాలంటే– రామాయణ కాలం నుంచే భారతదేశంలో ప్రజాస్వామ్యం ఉంది. పౌరుల మాటలను పాలకులు విశ్వసించేవారు. ప్రజాపాలన విశిష్టతను ప్రపంచానికి అవగాహన చేసింది భారతదేశమనే అస్మదీయాభిప్రాయం. – గోటేటి

వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న సామాజిక శాస్త్రాలలో ఒకటి అయిన ప్రజాపాలన (Public administration) ప్రాచీన భారతదేశంలో ప్రజాస్వామ్యం విశిష్టతను సంతరించుకొన్నది. ఆ పదం ఆవిర్భవించకముందే ప్రాచీన భారతదేశంలో వేదకాలమందు రాజనీతి, పరిపాలన గురించి వివరించారు. ప్రాచీన భారత గ్రంథాలలో ప్రజాపాలన గురించి, రాజు, ప్రజల కర్తవ్యాలను గురించి వివరించడం జరిగింది. ప్రాచీనమైన మనుస్మృతి కౌటిల్యుని అర్థశాస్త్రం వంటి గ్రంథాలతోపాటు నీతిచంద్రిక, నీతిరత్నాకరం మొదలైన గ్రంథాలలో పరిపాలనా సూత్రాల ప్రస్తావన ఉన్నది. రామాయణం, మహాభారతం, భాగవత పురాణాది గ్రంథాల్లో రాజు, రాజ్యపాలన, ప్రజా సంక్షేమం, యుద్ధం, శాంతి మొదలగు విషయాలను వివరించారు.

మనుధర్మశాస్త్రం మనుస్మృతి, కౌటిల్యుని అర్థశాస్త్రములలో పరిపాలనా సూత్రములను విస్తృతంగా చర్చించడం జరిగింది. సప్తాంగ సిద్ధాంతమనే పరిపాలనా నమూనా ప్రాచీన భారతదేశంలో ప్రజాపాలన పునాదులను తెలియజేస్తుంది. స్వామి, అమాత్య, ప్రజ, రాష్ట్ర, విత్త, బల, మిత్ర అనే సప్తాంగములు ప్రజాపాలనకు మూలాధారములని చెప్పింది. ప్రజారోగ్యం, పట్టణ నిర్మాణం, నీటి వసతి, పాడిపంటల నిర్వహణ, వన్య సంరక్షణ, స్త్రీ, శిశు, వృద్ధ జన సంరక్షణ విషయములన్నీ ప్రజాపాలనలో ఏ విధముగా జరుపవలసినదీ వివరించడం జరిగినది. అనివార్య విపత్తుల ద్వారా ప్రజలను ఇబ్బందులను ఎదుర్కొనవలసని పరిస్థితి ఎదురైనప్పుడు ప్రజాపాలనలో తీసుకొనవలసిన కట్టుదిట్టపు చర్యలను తెలియజేయడం జరిగింది.

భారత ప్రాచీన పరిపాలనా విధానంలో దండం ధర్మం అనే రెండు విషయములకు చాలా ప్రాముఖ్యమీయడం జరిగినది. ఆధునిక భాషలలో ఈ రెండు పదములకు సరియైన, కచ్చితమైన అనువాద పదముల అర్థముల కంటే అప్పటి సామాజిక, రాజకీయ, ఆర్థిక, ఆధ్యాత్మిక కోణముల పరిధిలో పరిపాలకులు వాటిని ఎంత సమర్థవంతముగా ఆచరణలో సాధ్యపరచినారనే విషయమును అవగాహన చేసుకొనవలసిన అవసరమున్నది. తప్పుచేసిన వారిని శిక్షించటంలో (దండం) ఏ విధమైన పక్షపాతం లేని ప్రజాపాలన కొనసాగాలి. ప్రజల శ్రేయస్సు పట్ల రాజు తన ధర్మాన్ని తు.చ. తప్పకుండా నెరవేర్చగలగాలి. ప్రజలను తనకన్న బిడ్డలవలె చూడాలి. తన శ్రేయస్సు కన్నా ప్రజా శ్రేయస్సుకి ప్రాధాన్యమీయడం ద్వారా విజయవంతమైన ప్రజాపాలన సాధ్యమవగలదు. ప్రజాపాలనకు పటిష్టమైన న్యాయవ్యవస్థ నిర్మాణం గురించి, ఎటువంటి వ్యక్తులను న్యాయమూర్తులుగా ఎంపిక చేయవలెననే విషయములు కూడా తెలియజేయబడినవి.

ప్రజాపాలన అంతిమ లక్ష్యం ప్రజాశ్రేయస్సు. ప్రజలందరికీ కనీసావసరములు చేకూర్చి, వ్యవసాయమునకు ప్రాముఖ్యత కలుగచేసి, సేద్యము ప్రజలకు ఉపాధికగా చేయడం ద్వారా ఆహార కొరత లేకుండా ఉండడంతో పాడి పశుగణాభివృద్ధి కూడా కలుగుతుంది. కులవృత్తి పనులకు గౌరవమును కలిగించి వాటిని ప్రోత్సహించడం ద్వారా సమైక్య జీవన విధానం ఏర్పడగలదు.

ప్రాచీన భారతీయ సమాజంలో ప్రజల జీవన విధానం ఆధ్యాత్మికతతో ముడిపడి ఉంది. సామాజిక, రాజకీయ, ఆర్థిక విషయములు అన్నీ విడివిడిగా కాక సమైక్య కోణంలో చూడబడి సమైక్య జీవన విధానమునకు పెద్ద పీటవేయడం జరిగింది. ఈ విషయమును భారత దేశ ప్రజలకంటే భారతదేశపు స్థితిగతులపై లోతైన పరిశోధనలు గావించిన ఇతర దేశస్థులు అనేకమంది ఈ అభిప్రాయమును తమ పరిశోధనల ద్వారా తెలియజేయడం భారతదేశానికే గర్వకారణం. అటువంటి జీవన విధానంలో జ్ఞానులు తమ జ్ఞాన సంపదను ఉచితముగా విద్యార్థులకు అందజేసి, వారికి భోజన, వసతి సదుపాయమును అందించేవారు. తద్వారా జ్ఞాన సంపదను అభివృద్ధి చేసి, ప్రజా సంక్షేమంలో పాలుపంచుకునేవారు. సాధారణ గృహస్థులు వారి వారి ఆర్థిక స్థోమతను బట్టి, తమ గృహిణుల సహకారంతో రోజుకి ఒకరు లేక ఇద్దరు విద్యార్థులకు మూడుపూటలా తమ ఇంట భోజన సదుపాయమును కలుగజేసి వారి వంతు ప్రజాసంక్షేమానికి పాటుపడేవారు. విద్యాదానం, అన్నదానం చాలా గొప్పవనీ తద్వారా జీవన్ముక్తి లభిస్తుందనే ఆధ్యాత్మిక భావన వారి సామాజిక స్పృహకి, సేవకీ తోడ్పడినది. అంతేకాకుండా భారతీయ జీవన విధానంలో ఒక్కొక్క మాసమునకు ఒక్కొక్క ప్రత్యేకత ఉన్నది. ఆ ప్రత్యేకతను సంతరించుకుని ప్రతీ మాసములోను ఏదో ఒక విధమైన దానమాచరించి తమశక్తి మేరకు ఇతరులను ఒకరినైనను ఆదుకొనే తత్వం వారి జీవన విధానంతో ముడిపడడం పేదవారికి కలవారి సహాయం ఏదో విధంగా అంది ప్రజా సంక్షేమానికి దోహదపడేవారు.

**ప్రజాపాలనలో ప్రజా విమర్శకి ప్రాధాన్యత :** ఆధునిక కాలంలో కూడా శ్రీరాముని పాలన ఆదర్శ పరిపాలనగా పరిగణింపబడుటకు కారణం ప్రజావిమర్శకు శ్రీరాముడు ఇచ్చిన ప్రాధాన్యత. అతి సామాన్యుడు అందునా బడుగువర్గపు మనిషి చేసిన విమర్శను శిరసావహించి శ్రీరాముడు ధర్మపత్నిపై పక్షపాత వైఖరి ప్రదర్శించకపోవడమే ప్రజా విమర్శకు ఆయన ఇచ్చిన ప్రాధాన్యత. ధర్మమూర్తి శ్రీరాముని ఇల్లాలు సీతమ్మ తన పతి ఆనతి తలదాలిచి అగ్ని ప్రవేశం చేయడం ద్వారా శ్రీరాముని ప్రజాపాలనకు మరింత విశిష్టతను కలుగజేసినది. శ్రీరాముడు ప్రజావిమర్శకు ఇచ్చిన ప్రాధాన్యతను గుర్తించి ప్రజలు ఆయనకు అత్యంత గౌరవమునునిచ్చి ధరణిజ సీతమ్మతో రఘునేతను అయోధ్యాపురికి స్వాగతించారు. ప్రజాపాలనలో ప్రజా విమర్శకు ఈయవలసిన ప్రాధాన్యతను, అదే విధంగా ధర్మబద్ధుడైన పాలకునకు ప్రజలు ఎలాటి గౌరవమును ఈయగలరో అనే రెండు విషయములకు ఇది ఉదాహరణ.

భారతదేశమునకు సమర్థవంతమైన పాలన అందించిన ఒకానొక మహారాజు తన పాలనలో ప్రజల కష్టసుఖములను తెలుసుకొనుటకు స్వయముగా దేశ పర్యటన కొనసాగిస్తున్నప్పుడు ఒక గ్రామములో ఒక ముదుసలి వ్యక్తి చిరిగిపోయిన తన వస్త్రమును కట్టుకొనటం చూసిన మహారాజు తన ఉత్తరీయమును అతనికి ఈయబోగా అతను సవినయంగా “మహారాజా చినిగిపోయిన వస్త్రమును నేను కుట్టుకుని ధరిస్తాను. ఈ మాత్రం వస్త్రంలేని మరొక నిరుపేదకు మీ ఉత్తరీయమును దానం చేయండి” అని చెప్పడంతో ఆ వ్యక్తి విజ్ఞతను మహారాజు ప్రశంసించారు. ప్రజాపాలనలో ప్రజా విజ్ఞత మేళవించినపుడు ఆ పాలన మరింత రంజకంగా ఉండగలదు.

భారతానికి స్వాతంత్ర్యం సిద్ధించిన పిదప భారత రాజ్యాంగంలో మహాత్మాగాంధీ సిద్ధాంతమునకు ప్రాధాన్యతను కలుగజేస్తూ లిఖించిన “ప్రతీ అభాగ్యుని కన్నీటిబొట్టు తుడుచుటకు...” అనే వాక్యం పాలకుల కర్తవ్యమును తెలియజేస్తుంది. ప్రజా పాలనలో న్యాయం జరిగినపుడు ప్రజలు ఏ విధంగా హర్షించగలరో ఇటీవల జరిగిన ‘దండాచరణ’ తెలియజేస్తుంది. అనేకమంది ప్రాణములు బలిగొన్న అతనికి తగిన శిక్ష విధించడంలో భారత రాష్ట్రపతి శ్రీప్రణబ్‌ముఖర్జీకి ప్రజా ప్రశంసలు అందినవి. వేదములు, ప్రముఖ గ్రంథములు, ఋషులు, యోగులు కూడా తమ తమ శైలిలో తెలియజేసి అనేక ధార్మిక సూత్రాలను విశ్వశాంతి కలుగజేయుటకు మనకు ఎన్నో అందించారు. బహుముఖంగా విస్తరించి ఉన్న ప్రాచీన భారత దేశ పరిపాలనా విషయ సంపదపై విస్తృత పరిశోధన చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. ఖనిజ సంపదకై లోతైన గనిలో సాహసించే ప్రయత్నం చేసినట్లు ప్రజాపాలనలో మరిన్ని పరిశోధనలు వెలువడడం ద్వారా ప్రస్తుత, భావితరముల ప్రజాపాలనకు ఎంతో ఉపయోగము అవుతుందనడంలో అతిశయోక్తి లేదు.

*(తెలుగు విద్యార్థికి కృతజ్ఞతలు)*



# మహర్షి బులుసు సాంబమూర్తి



**త్యా**గి, సత్పురుషుడు, సత్యశీలుడు శాంతమూర్తి ఆయన పొట్టి శ్రీరాములుగా ప్రాయోపవేశానికి వెన్నుదన్నుగా నిలిచి తన యింట్లో వసతి కూర్చారు. ఒక రకంగా ఆంధ్రరాష్ట్రం యేర్పడటానికి ఆయన పరోక్షకారకుడు. కానీ రాష్ట్ర ప్రారంభోత్సవంలో ఆయనను గౌరవించలేదు సరికదా; ఆహ్వానాన్ని కూడా పంపలేదు.

**జా**తీయవాదులు ఎట్టి ఊరేగింపులలోగానీ, సభలలో గాని మువ్వన్నెల జెండాను ఉపయోగించరాదని బ్రిటిషు ప్రభుత్వం నిషేధించింది. ఇది అన్యాయమని 1923 జూలైలో తమ నిరసనలు తెలియజేస్తూ జాతీయ నాయకులు నాగపూర్‌లో ఒక సమావేశం ఏర్పాటు చేయగా, సాంబమూర్తిగారు అక్కడికి వెళ్లి, సభలలో అందరినీ కలిసి సత్యాగ్రహంలో పాల్గొన్నారు. జెండా ఉద్యమం విజయవంతమైంది. అదే సంవత్సరం డిశంబరు నెలలో కాకినాడలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఆహ్వాన కమిటీకి ప్రధాన కార్యదర్శిగా బులుసు సాంబమూర్తిగారు బాధ్యత వహించారు. అధ్యక్షులుగా 'దేశభక్త' కొండా వెంకటప్పయ్య పంతులుగారు ఆ కాంగెస్ సభలకు మౌలానా మహమ్మద్ ఆలీ అధ్యక్షులుగా, గాంధీ, నెహ్రూ, పటేల్, పట్టాభి మొదలైన ప్రముఖ నాయకులందరూ హాజరైనారు. అక్కడి ఏర్పాట్లు, వసతులు, భోజన సదుపాయాలు అన్నీ సాంబమూర్తి గారే కల్పించారు.

ఎంతో ఘనంగా సాంబమూర్తిగారు ఆ సభలను జయప్రదం చేశారు. 20 సం.ల వయస్సు గల ఏకైక కుమారుడు ఆ సభలు జరిగే కొద్ది రోజుల క్రితమే పాముకాటుచే మరణించారు. ఆ పెనువిషాదాన్ని దిగమింగి సభలను జయప్రదం చేసినందుకు గాంధీగారితో సహా పెద్దలందరూ చివరన సంతాపం వెల్లడించారు. ఆ స్థితప్రజ్ఞుడు ప్రశాంతంగా కళ్లుమూసుకుని అశ్రువులు రాల్చాడు. సుఖ, దుఃఖాలను సమభావంతో చూసే సాంబమూర్తిగార్ని అందరూ 'మహర్షి' అన్నారు.

తరువాత కాంగ్రెస్ సమావేశాల్లో పాల్గొంటూ సైమన్ కమిషన్‌ను వ్యతిరేకించి జైలు శిక్ష అనుభవించారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని బ్రిటిషువారు ఉప్పుపై విధించిన పన్ను తొలగించేదాకా ఆహారంలో ఉప్పువాడనని భీష్మ ప్రతిజ్ఞ చేశారు.

1857లో జరిగిన ప్రథమ స్వాతంత్ర్య సమరంలో అనేకమంది భారతీయ సైనికుల్ని నిర్దాక్షిణ్యంగా హతం చేసిన మిలిటరీ జనరల్ 'నీల్' శిలా విగ్రహాన్ని మద్రాసు హైకోర్టు వద్ద నుంచి తొలగించాలని సత్యాగ్రహం చేసి ఆయన విజయం సాధించారు. స్వాతంత్ర్య సమరయోధుల్ని రక్తధారల కారేటట్లు లాఠీఛార్జి చేసి హింసించిన కాకినాడ పోలీసు ఆఫీసర్లు డప్పుల సుబ్బారావు, ముస్తఫా అలీఖాన్ గార్ల కిరాతాన్ని ఓర్పుగా భరించాడు. 1942లో క్విట్ ఇండియా' ఉద్యమంలో వ్యతిరేకించిన రాజాజీవైపు మొగ్గి హైకమాండ్‌కు దూరమైనాడు.

ఆంధ్రుల అభ్యున్నతికి మద్రాసులో 'ఆంధ్ర మహాసభ' ఏర్పాటుకు కారణభూతులు సాంబమూర్తిగారే. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేయటానికి పూనుకున్న అమరుడు శ్రీ పొట్టి శ్రీరాములు గారికి తన భవనాన్ని వసతిగా ఇచ్చాడు. నెహ్రూ గారికి భయపడిన కాంగ్రెస్‌వారెవరూ శ్రీరాములు ప్రాయోపవేశానికి వసతి యివ్వలేదు. అయితే విచిత్రం ఆంధ్రరాష్ట్ర అవతరణానికి ఈ మహానుభావునికి ఆహ్వానం లేదు.

మద్రాసు నుండి భార్య వియోగంతోనూ, పదవీ ప్రాబల్య రహితంగాను, స్వస్థలం కాకినాడకు మకాం మార్చారు. ఆయన్ను పూర్వం ఆరాధించినవారు మొహం చాటేశారు. వార్ధక్యం మీదపడింది. కంటి చూపు తగ్గింది. సాయంత్రం వేళలలో దేవాలయాలు సందర్శించటమే ఆయన దినచర్య అయింది. మానసిక వ్యధతో 1958 ఫిబ్రవరి 3న దివంగతుడైనాడు. అంతటి దేశభక్తుణ్ణి ఈనాడు తలచుకునేవారు లేరు. వితంతువైన ఆయన కుమార్తె ఆర్థిక సహాయం కోసం ప్రభుత్వానికి అర్జీ పంపితే సాంబమూర్తిగారు స్వాతంత్ర్య సమరయోధుడని ఆధారాలు లేవు' అని సమాధానమిచ్చారు. అయితే కాకినాడ మునిసిపల్ కార్పొరేషన్‌వారు ఒక పేటకు 'సాంబమూర్తినగర్' అని నామకరణం చేశారు. అన్నీ మౌనంగా చూసిన కేంద్రం 2008లో ఆయన పేరుమీద ఒక తపాలా బిళ్లను విడుదల చేసింది. ఒక స్వచ్ఛంధ సంస్థ వారు ఆయన బస్టు సైజు విగ్రహాన్ని ఏర్పాటు చేసి, ఒక ఇన్సిట్యూట్ నిర్మించి, వికలాంగులకు సహాయం అందిస్తున్నారు.

## ఒక్క తెలుగు భాషలోనే పద్యం ఉంది!

### -హృద్యంగా చెప్పగల శక్తి ఒక పద్యానికే ఉన్నది!-

**పో**తనగారి పద్యాలను ఇప్పటికీ చక్కగా పలికేధారణగల పిల్లలున్నారు. ఏకసంధాగ్రాహిలున్నారు. జూటూరు కృష్ణవేణిగారు తెలుగు పద్యం యొక్క రసరమ్యతను గూర్చి వ్రాసిన వ్యాసాన్ని ఇందు పొందుపరుస్తున్నాం.

తెలుగు సాహితీరంగంలో ప్రాచీన కాలం నుండి పద్యం ఒక విశిష్ట స్థానాన్ని సంపాదించుకుంది. ఆటవెలది, తేటగీతి, కంద, సీస పద్యాలతో అలంకారభూషిత అయిన మన పద్యం నాటి నుండి నేటి వరకూ విభిన్న రూపాలతో రసజ్ఞులైన పాఠకులను రంజింపచేస్తూనే ఉంది.

పాశ్చాత్య పోకడలతో, నానాటికీ కనుమరుగవుతున్న ప్రాచీన పద్యాలను, వాటిలోని సొగసులను, చమత్కారాలను అప్పుడప్పుడూ గుర్తు చేసుకోవడం మన కనీస కర్తవ్యం. కాకుమాను మూర్తి కవి రచించిన 'రాజవాహన చరిత్ర' అనే అయిదు ఆశ్వాసాల ప్రబంధంలోని ఈ పద్యాన్ని చూడండి:

**అతి మధురంబుగా పెదవి యభ్రముగా నెరికొప్పు జ్యోత్స్నగా**
**సతతము లేతనవ్వు ఘనసారముగా నునుదటే మాట యం**
**చితదరదంబుగా గళము చిత్రముగా, నిలువబ్ద నేత్ర స**
**మ్మతి గనుగొన్ రసజ్ఞునకు ముందునకుం దగ వందమందదే?**

(రాజ 4-12)

పై పద్యంలో రెండర్థాలు ఉన్నాయి. ఆ చిన్నదాన్ని చూస్తే పెదవి అతి మధురంగా, కొప్పు మేఘంలా, నవ్వు వెన్నెలలా, పలుకులు పచ్చ కర్పూరంలాగా, కంఠం శంఖాన్ని చీల్చే దరదంలాగ సరసునికే కనబడినపుడు సామాన్యులు ఎందుకు మోహించరు?

రసవైద్యం చేసే వైద్యునికి అమ్మాయి పెదవి అతిమధురం అనే గ్రంథ్యాణం లాగా, కొప్పు అభ్రకంలాగా, నవ్వు పొట్టతీగెలాగ, పలుకులు పచ్చకర్పూరంలాగా, కంఠం పాదరసంలాగా కనపడుతాయట. అందం మందుకు తగినట్లుగా అమరుతుందట. ద్విచమత్కారాన్ని గ్రహించినారు కదూ!

# నర్తనశాల కళా రూపకల్పనకు శర్మగారెంతో గ్రంధాధ్యయనం చేసారు!

ఇందుకోసం ఆయన శిల్పకళకు సంబంధించిన పలు గ్రంథాలు అధ్యయనం చేశారు. ఎన్నో దేవాలయాలు, చారిత్రక కట్టడాలను ఆయన సందర్శించారు. తన పరిశోధనలో భాగంగా శర్మగారు ఒకసారి అమలాపురానికి వెళ్లినపుడు అక్కడ ఒక స్థూపాన్ని చూసి ఆకర్షితులయ్యారు. ఆ స్థూపం మీద, ఆడ మగ కాని బొమ్మ ఉంది. పురావస్తు శాస్త్రగ్రంథాల ద్వారా ఆ శిల్పానికి సంబంధించిన విశేషాలను సేకరించారు. అదే విధంగా కేరళ ప్రాంతంలోని స్త్రీల శిరోజాలంకరణనే ఆయన బృహన్నల పాత్రకు ఎంచుకున్నారు. రాయలసీమలో పాతతరం స్త్రీలు ధరించే ఆభరణాలనూ, కేరళ సంప్రదాయానికి చెందిన తలపాగా నమూనాను పరిశీలించి... చివరికి బృహన్నల గెటప్‌లకు సంబంధించి పది స్కెచ్‌లు వేశారు. వాటిలో మూడింటిని మాత్రమే ఎన్టీఆర్‌కు చూపించారు. తలపాగాలేని రెండు స్కెచ్‌లు రెండు విభిన్న సన్నివేశాల్లో కనిపించే బృహన్నల కోసం, ఒకటి నాట్యాచార్యుడిగా దర్శనమిచ్చే బృహన్నల కోసం అని అనుకున్నారు.

నాలుగు గంటల మేకప్ అనంతరం వినూత్నమైన ఆహార్యాన్ని ధరించి బృహన్నల రూపంలో ఎన్టీఆర్ దర్శక, నిర్మాతల సమక్షాన నిలుచున్నారు, ఆ సందర్భంలో తమకు గురుతుల్యులైన కె.వి.రెడ్డిగారిని ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఆయన బృహన్నల ఆహార్యాన్ని నిశితంగా పరిశీలించి శర్మ కృషిని ఎంతగానో ప్రశంసించారు. బృహన్నల పాత్రకోసం శర్మ తీసుకున్న శ్రద్ధ కారణంగా ఆ పాత్ర ప్రేక్షకులను విశేషంగా ఆకర్షించింది. బృహన్నల పాత్రనే కాకుండా కుంకుభట్టు, కీచకుడు వంటి పాత్రల రూపకల్పనలో సైతం శర్మ ఎంతో పరిశ్రమించారు. నర్తనశాల, కీచకుని మందిరం, సుదేష్ణ అంతఃపురం తదితర సెట్టింగుల నిర్మాణంలో శర్మపడిన శ్రమ నర్తనశాలకు ఎనలేని ఖ్యాతిని తెచ్చింది. కేవలం భారతీయ ప్రేక్షకులేగాక, విదేశీయులు సైతం శర్మ కళాదర్శకత్వ ప్రతిభను వేనోళ్ల కొనియాడారు. జకర్తాలో జరిగిన అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో శర్మ ఉత్తమ కళాదర్శకుడి పురస్కారాన్ని గెలుచుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని మద్రాసులో ఏర్పాటు చేసిన సభలో శర్మ మాట్లాడుతూ "నేను కళాదర్శకుడిని కావడానికి ఈనాడు ఈ స్థితికి రావడానికి ఎందరెందరో కారణం. నన్ను ఎంతగానో ప్రోత్సహించిన ఆ మహనీయులందరికీ ఈ శుభ సందర్భంలో నా రెండు చేతులనూ జోడించి నమస్కరించడానికి వీలు లేకుండా చేశాడా భగవంతుడు. అదే నాకు బాధగా ఉంది" అని అనగానే సభికుల కళ్లు చెమ్మగిల్లాయి. ఒక చేయి లేకపోతేనేం కళాదర్శకుడిగా శర్మ అధిరోహించిన స్థానం అసామాన్యం.



మహాభారతంలో పాత్రలకి సరిపోయే నటీనటులను ఎంపిక చేయడంలో నిర్మాత దర్శకులకున్న ఉత్తమాభిరుచి ఈ సినిమాలో అడుగడుగునా దర్శనమిస్తుంది. బృహన్నల పాత్ర అత్యంత సంక్లిష్టమైనది. ఇది స్త్రీపురుష సమ్మిళితం కాబట్టి హావభావాల విషయంలో ఏ మాత్రం పొరపాటు జరిగినా ఆ పాత్ర అభాసు పాలవుతుంది. బృహన్నల పాత్రపోషణకు అవసరమైన హోమ్‌వర్క్ చేయడం కోసం నిర్మాతను ఆయన ఒక నెల రోజుల వ్యవధి అడిగారు. ఉత్తరకు నాట్యాన్ని నేర్పే ఆచార్యుడాయన. ఉత్తర పాత్రని ధరించే ఎల్.విజయలక్ష్మి గొప్ప నాట్యకళా కారిణి. ఆమెకి నాట్యం నేర్పే గురువు ఆమెకన్నా వేగంగా నృత్యం చేయకపోతే బాగుండదు. అందుకే ఎన్టీఆర్ ఈ చిత్రానికి నృత్యదర్శకత్వం చేస్తున్న వెంపటి పెద సత్యం దగ్గర ఆ నెల రోజుల వ్యవధిలో నాట్యాన్ని నేర్చుకోవడం ఆరంభించారు. ప్రతిరోజూ ఉదయం నాలుగు గంటలకు సత్యంగారు ఎన్టీఆర్ ఇంటికి వెళ్లి, ఆరుగంటల దాకా నాట్యం నేర్పేవారు. ఇందులో ప్రావీణ్యం సంపాదించుకున్న తర్వాతే ఆయన షూటింగ్‌కు ఓకే అన్నారు. ●


# మనం తెలుసుకోదగిన మన తెలుగు ప్రముఖులు

## కొలచల సీతారామయ్య



రకరకాల యంత్రాలతో చలనం కలగటానికి తిరిగే షాఫ్టుల, టర్బైన్‌లు ఎన్నో ఉన్నాయి. అవి తిరిగేటప్పుడు ఒకదాని ఉపరితలం మరోదాని మీద రాచుకుంటుంది. అప్పుడు పుట్టిన నిరోధాన్ని 'ఘర్షణ' అంటారు. ఘర్షణ లేనిదే చలనం ఉండదు. ఈ ఘర్షణను నిరోధించి ఆయా భాగాలు సాఫీగా తిరగటానికి 'కందెనలు' (లూబ్రికెంట్స్) ఉపయోగిస్తారు. ఇవి ఘన, ద్రవ, వాయు రూపాలలో ఉంటాయి. ఇటువంటి కందెనల మీద పరిశోధనలు చేసి 'కెమటాలజీ' (రసాయనశాస్త్రం) కి పునాది వేసిన రసాయన శాస్త్రవేత్త సీతారామయ్య కృష్ణాజిల్లాలోని ఉయ్యూరు వాస్తవ్యుడు. భౌతిక రసాయన శాస్త్రాలలో విజ్ఞానాన్ని సంపాదించాడు. మొదట అమెరికాలోనూ, తరువాత రష్యా సంస్థల్లోనూ పనిచేసి అక్కడే చనిపోయారు.


## గాడిచర్ల హరిసర్వోత్తమరావు



ఆంధ్రులలో మొట్టమొదటి రాజకీయ ఖైదీగా మన్ననలను అందుకున్నారు. యం.ఏ. డిగ్రీ పొందిన రెండవవారు గాడిచర్లవారు. విద్యార్థిగా ఉండగా వయోజనలకు రాత్రి పాఠశాలను నిర్వహించారు. 'స్వరాజ్య' పత్రికను నడిపారు. 1908లో తిరునల్వేలిలో జరిగిన మారణకాండను 'విపరీతబుద్ధి' అనే పేరున రాస్తే ఆంగ్ల ప్రభుత్వం రాజద్రోహమని 3 సంవత్సరాలు కఠిన కారాగార శిక్షను విధించి, వెల్లూరు జైలులో పెట్టింది.

ఆంధ్రలో 'హోంరూల్ ఉద్యమా'నికి శ్రీకారం చుట్టి ప్రచారం చేశారు. హిందూస్థానీ సేవాదళ్ నిర్మాణానికి కృషి చేశారు. మద్రాసు కౌన్సిల్, కేంద్ర శాసనసభలకు కర్నూలు జిల్లా అభ్యర్థిగా ఎన్నికయ్యారు. కొమర్రాజు వేంకటలక్ష్మణరావుగారితో కలిసి 'విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి'ని స్థాపించి వయోజనుల కోసం ఎన్నో గ్రంథాలు రాసి ప్రచురించారు. ఎన్నో పత్రికలకు సంపాదకుడిగా పనిచేశారు. ఆంధ్రరాష్ట్ర ఉద్యమంలో విశిష్టమైన పాత్ర నిర్వహించారు. 1914లో ఆంధ్ర గ్రంథాలయ సంస్థను నెలకొల్పారు. గ్రంథాలయోద్యమానికీ ఎనలేని కృషి చేశారు.

## భారత కోకిల సరోజిని నాయుడు



సరోజిని నాయుడు భారత జాతీయ కాంగ్రెస్ తొలి మహిళా అధ్యక్షురాలు, తొలి మహిళా గవర్నరు! హైదరాబాద్‌లో ఒక బెంగాలీ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ఈమె తండ్రి అఘోరనాథ్ చటోపాధ్యాయ నిజాం కాలేజీ స్థాపకుడు, శాస్త్రవేత్త, తత్వవేత్త. తల్లి బరదా సుందరి దేవి కవయిత్రి, సరోజినీ ఉర్దూ, తెలుగు, ఆంగ్లము, పర్షియన్, బెంగాలీ భాషలు అనర్గళంగా మాట్లాడేవారు.

నిజాం పాలనలో అప్పటి హైదరాబాదులో స్త్రీల చదువుకు సరైన సౌకర్యాలు లేకపోవడం వలన ఆమె మద్రాసులో చదువుకున్నారు. 15 సంవత్సరాల వయస్సులో దక్షిణాదికి చెందిన డాక్టర్ గోవిందరాజులు నాయుడును ప్రేమించి, తన చదువు పూర్తయిన తర్వాత 19 సంవత్సరాల వయస్సులో ఆయన్ని కులాంతర వివాహం చేసుకుని అప్పట్లో ఓం సంచలనం రేపారు. వీరి వివాహాన్ని మద్రాసులో కందుకూరి వీరేశలింగం పంతులు జరిపించారు. ప్రేమించడం నేరం కాదు... కానీ... చదువు పూర్తయిన తరువాత తగిన వయస్సులో పెళ్లి చేసుకోవాలనే సత్యాన్ని ఆ తరం అమ్మాయిలకు సరోజిని నాయుడే తెలియజేసినది! ●

# చివరి రోజుల్లో ఎస్వరలక్ష్మి గదిలో బందీకృతమయింది!

## -చివరగా ఆమెను దాసరి కార్యక్రమానికి వెడుతూ చూశాను.. గోటేటి-

ప్రతిభావారి 'బాలరాజు' (1948) కి విజయోత్సవాల మీద విజయోత్సవాలు జరుగుతున్నాయి. నాటి చిత్రాల్లో అమితమైన ఆదరణ పొందిన 'బాలరాజు' కొన్ని థియేటర్లలో సంవత్సరం పాటు నడిచింది. ఈ జానపద చిత్రంలో అక్కినేని నాగేశ్వరరావు నాయకుడైతే, మృదుమధుర గాయని యస్. వరలక్ష్మి నాయిక. ఆర్ద్రత నిండిన ఆ పాత్రను వరలక్ష్మి నిర్వహించి ప్రేక్షకుల చేత చీరకొంగులతో కళ్లు తుడిపించింది.



అక్కినేని, కస్తూరి శివరావుతోపాటు వరలక్ష్మికి అభిమానులు హారతి పట్టారు. వరలక్ష్మి గాన సరస్వతి. గాత్రం అమృత ధారాపాతం. సెలయేరు గలగలలు, చల్లని పిల్లగాలి ఆమె కంఠంలో వినిపిస్తాయి. అందుకే ఆమెను 'ఎస్వరలక్ష్మి' (ముళ్లపూడి వెంకటరమణ) అన్నారు.

ఎప్పుడో 'ఇల్లాలు' (1940)లో పరికిణి, గౌను వేసుకుని తోటలో పాడిన బసవరాజు అప్పారావుగారి గీతం 'కోయిల లొకసారొచ్చి కూసిపోయింది'తో ఆమె సంగీతాభిమానుల్ని ఆకట్టుకుంది.

పిల్లలయినా, పెద్దలయినా పాటలు, పద్యాలు పాడగలిగే వాళ్లనే నాటి రోజుల్లో చిత్రాలకు తీసుకునేవారు గనుక, పాడగల వరలక్ష్మి 'బాలయోగిని' (1937)లో బాలనటిగా ప్రవేశించి నాయిక పాత్రలు, వదిన పాత్రలు, అమ్మ పాత్రలూ అత్త పాత్రలూ అన్నీ ధరించింది. అటు తమిళంలో కూడా ఆమె నటించి పేరు తెచ్చుకుంది. రెండో చిత్రమే తమిళ చిత్రం. 'సేవాసదన్', 'ప్రేమసాగర్' అనే హిందీ చిత్రం మూడోదయితే, అన్ని చిత్రాల్లోనూ బాలనటిగా ఆమె పాటలు పాడింది.

'మాయలోకం' (1945) 'పల్నాటియుద్ధం' చిత్రంలో అక్కినేని, ఆమె జంట. వరలక్ష్మి శాస్త్రీయ సంగీతం బాగా అభ్యసించింది. రాజేశ్వరరావుతో గ్రామఫోన్ పాటలు పాడినపుడు హిందూస్థానీ నేర్చుకుంది. నాటకాల్లో నటించింది. ముఖ్యంగా 'సక్కుబాయి' నాటకం. వరలక్ష్మి నిర్మాతగా కూడా మారింది. సతీసావిత్రి, వీరభాస్కరుడు, బభ్రువాహన చిత్రాలు తీసిందామె.

సాత్విక పాత్రలు, గయ్యాళి అత్త పాత్రలూ ధరించిన వరలక్ష్మి చిత్రాల్లో మహామంత్రి తిమ్మరుసు, శ్రీకృష్ణార్జునయుద్ధం, ఆస్తులు-అంతస్తులు, జీవితం, విజయవారి హరిశ్చంద్ర, ఉమ్మడి కుటుంబం, శ్రీవేంకటేశ్వర మహాత్యం - కొన్ని. ఆనాడు 'పల్నాటియుద్ధం'లో పాడిన 'ఈ కుహూరాత్రి' 'బాలరాజు'లో పాడిన 'ఎవరినే నేనెవరినే?', 'ఓ బాలరాజా', 'పతి రూపము నీయవయా', 'మహామంత్రి తిమ్మరుసు'లో 'లీలాకృష్ణ' 'తిరుమల తిరుపతి వేంకటేశ్వరా' (సుశీలతో) 'వెంకటేశ్వర మహాత్యం'లో 'శ్రీదేవిని నీదు దేవేరిని' 'వరాల చేరమయా' వంటి పాటలు వరలక్ష్మి పాటకు ప్రమాణాలు. 1986లో వచ్చిన 'ముద్దులకృష్ణయ్య' తర్వాత ఆమె చిత్రాల్లో నటించలేదు.

శారదా స్టూడియో అధినేత, నిర్మాత, పరిశ్రమలో ప్రముఖుడూ అయిన ఎ.ఎల్. శ్రీనివాసన్‌ను వరలక్ష్మి వివాహం చేసుకున్నారు. 50 సంవత్సరాల నటజీవితంలో వరలక్ష్మి తెలుగు, తమిళ చిత్రాలు ఎన్నో చేసింది. పేరు, పెన్నిధి సంపాదించుకుంది. కాని శ్రీనివాసన్ మరణించిన తర్వాత చివరి సంవత్సరాల్లో ఆమె బయటికి ఎక్కడికీ రాలేదు. రాలేకపోవడం కాదు. ఇంట్లో వున్న వాళ్లే రానివ్వలేదు. ఒకసారి వి.ఎ.కె. రంగారావు, నేనూ ఆమెను చూడ్డానికి ఇంటికి వెళ్ళితే మమ్మల్ని రానివ్వలేదు. ఆరోగ్యం సరిగా లేదని చెప్పారు. ఎవర్నీ కలవనిచ్చేవారు కాదు. అలా ఒక కళాకారిణి గదిలోనే బందీగా వుండిపోయింది- మూడు నాలుగేళ్లపాటు!!

బయటివాళ్లు ఆమెను మతిభ్రమించిందనీ, అందుకే రానివ్వరనీ ఏవేవో చెప్పుకునేవారు. ఆరోగ్యం బాగులేక ఆమె రావడం లేదని కొందరు చెప్పుకునేవారు. ఆమె మరణించినపుడు గాని, ఆమె పేరు బయటికి రాలేదు.

-రావికొండలరావు


We Provide your comfortable Stay and Tasty Food Hospitality


Bhimas Deluxe Hotel

(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)

34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com


# మద్రాసుకు మొదటి రైల్వేస్టేషన్ రాయపురం రైలుస్టేషను

మద్రాసు మద్రాసు- అని పేరేగానీ వసతులన్నీ అరకొరకగా యేర్పడినవే! చిన్న చిన్న ఊళ్ళన్నీ చేరి మద్రాసు అయినది. అప్పుడంతగా విశాలమైన రోడ్లు లేవు. సినిమా థియేటర్లూ లేవు, పై వంతెనలూ లేవు. ఎక్కడికక్కడ, చిన్ని చిన్ని ఊళ్ళు పల్లెలుగా ఉన్న ప్రదేశాలను మ్రింగేసి ఓ పట్టణంగా చెన్న పట్టణమయింది. రైలు స్టేషన్ ఇప్పటి నగరానికి శివారులో ఉన్న రాయపురం రైలు స్టేషను నుంచే ప్రయాణాలు సాగించేవారు. ఇలాంటి ప్రభుత్వ అధీన భవనాలన్నిటికి జేగురు రంగు పూసేవారు. ఇప్పటికీ కొన్ని కోర్టు భవనాలకూ, హైకోర్టు భవనాలకూ అదే జేవురు రంగు చిహ్నంగా వున్నది.



తరువాతరువాత మద్రాసు సెంట్రల్‌రైల్వేస్టేషన్ యేర్పడింది. ఎక్కువగా పెరిగిన రైళ్లను దృష్టిలో పెట్టుకుని ప్రక్కనున్న కూవమ్ రివర్ను మూసేసారు. క్రమంగా మూర్ మార్కెట్, మైలేడీస్ గార్డెన్ అంతా రైల్వేయార్డుగా విస్తరింప బడింది. ప్రక్కనున్న జూ (జంతుశాల)ను కూడా గిండీకి మార్చబడింది. అనేక లోకల్ ట్రయిన్స్ కోసం మూర్‌మార్కెట్‌లో 'జూ'ఉన్న ప్రదేశంలోనే రైల్వే యార్డు విస్తరింపబడింది. క్రమంగా రాయపురం రైలు స్టేషన్ లోకల్ రైల్వేస్టేషనయింది.